క్లుప్తంగా

నేడు వ్యవసాయ శాఖ మంత్రి పర్యటన

పెద్దకొత్తపల్లి: జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి కొత్తగా మంజూరు అయిన బాచారం హైలెవల్ కెనాల్ కాల్వ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి బుధవారం ప్రారంభిస్తారని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాచారం హైలెవల్ కెనాల్ కాల్వకు రూ.34 కోట్లు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ

చారకొండ: నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండల కేంద్రంతో పాటు తిమ్మాయిపల్లిలో మంగళవారం ఆమె నర్సరీలను పరిశీలించారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు. నర్సరీ చుట్టూ నీటి నిల్వ, వాటి పరిసరాలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదేవిధంగా కంపోస్టు షెడ్, తదితర వాటిని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కల్వకుర్తిరూరల్: మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన పోశయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో మంగళవారం సర్పంచ్ శ్రీలత రూ.5వేలు, కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ జగన్ 50 కేజీల బియ్యాన్ని పోశయ్య కుటుంబానికి అందజేశారు.

ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూత

కల్వకుర్తిరూరల్: వెన్నెముక ఆపరేషన్ చేయించుకోవడానికి ఆర్థికస్తోమత లేని ప్రశాంత్‌కు ఉప్పలచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తనయుడు డాక్టర్ అఖిల్ మంగళవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. బాధితుడు హైదరాబాద్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో ప్రశాంత్‌కు సమస్యను వివరించగా ఆయన స్పందించి వెంటనే ఆర్థికసాయం అందజేశారు.

రెండో ఏఎన్‌ఎంల ముందస్తు అరెస్టు

ఉప్పునుంతల: హైదరాబాద్‌లోని కోఠి ఆస్పత్రి ఎదుట రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న ధర్నాకు మంగళవారం మండల కేంద్రం నుంచి బయలుదేరుతున్న రెండో ఏఎన్‌ఎంలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై ఎస్ఐ గురుస్వామి విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

బీఎస్పీ అసెంబ్లీ అభ్యర్థిగా కొత్తపల్లి కుమార్


కొత్తపల్లి కుమార్(ఫైల్)

నాగర్‌కర్నూల్‌రూరల్: బహుజన సమాజ్‌వాజ్ పార్టీ(బీఎస్పీ) నియోజకవర్గ అభ్యర్థిగా కొత్తపల్లి కుమార్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. పార్టీ బలోపేతానికి నిరంతరం పనిచేస్తున్న కుమార్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ గడ్డపై బీఎస్పీ జెండాను ఎగురవేస్తామని కుమార్ తెలిపారు.

నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు

వెల్దండ: మండల కేంద్రంలో మట్ట సత్తమ్మ నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. నాటు సారా విక్రయించిన, తయారు చేసిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో సారా విక్రయిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ పేర్కొన్నారు.

మెడికల్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

పెంట్లవెల్లి: మండల కేంద్రానికి చెందిన లికిత్ పీజీ ముంబైలోని లోక్‌మాన్యా తిలక్ ప్రభుత్వ కాలేజీలో మెడికల్ సీటు సాధించాడు. ఈ మేరకు మంగళవారం గ్రామస్తులు విద్యార్థి లికిత్‌ను అభినందించి సన్మానించారు.

జిల్లా ఖోఖో జట్టు ఎంపిక



కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్రలో మంగళవారం అండర్ -17, అండర్ -14 విభాగంలో ఖోఖో జట్టును ఎంపిక చేశారు. ఎంపీపీ మనోహర, సర్పంచ్ సుశీలలు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు బాగా రాణించి రాష్ట్రస్థాయికి చేరుకోవాలని కోరారు. అనంతరం క్రీడాకారులకు షీల్డ్, మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. పాండు, కృష్ణప్రసాద్‌గౌడ్, రమేష్, రాజేందర్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి సేవలో ముందంజ

- కల్వకుర్తి సీహెచ్‌సీలో నెలకు నగటున 140కు పైగా కాన్పులు


కల్వకుర్తి ఆస్పత్రికి పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు

కల్వకుర్తి టౌన్: నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అన్న నానుడిని రాష్ట్రం ఏర్పడ్డాక నేను వస్తా బిడ్డో సర్కారు దవాఖానాకు అన్నట్టుగా వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో ప్రభుత్వ ఆస్పత్రికి కాన్పుల కోసం రావాలంటే మహిళలు వెనకంజ వేసేవారు. ప్రభుత్వ దవాఖానలో సాధారణ ప్రసవాలు అయ్యేవిధంగా సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. కల్వకుర్తి సీహెచ్‌సీలో నెలకు సగటున 140కు పైగా డెలివరీలు జరుగుతున్నాయి. ఇలా కల్వకుర్తి సీహెచ్‌సీ ప్రసవాల సంఖ్యలో రాష్ట్ర స్థాయిలోనే గుర్తింపు తీసుకొచ్చింది. కల్వకుర్తి సీహెచ్‌సీలో ఆరునెలల నుంచి 1000 వరకు డెలివరీలు కావటమే అందుకు నిదర్శనం.

పెరుగుతున్న కాన్పుల సంఖ్య

కల్వకుర్తి ప్రాంతంలో కొనసాగుతున్న డెలివరీలలో 95 శాతం వరకు డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరుగగా, అందులో 70 శాతం వరకు సాధారణ డెలివరీలు అవుతున్నాయి. సాధారణ డెలివరీల సంఖ్యను గణనీయంగా పెంచటంతో ఆరోగ్య సమస్యలు తక్కువగా ఉంటాయని మహిళలు సైతం భావిస్తుండటంతో కాన్పుల సంఖ్య పెరిగింది. దీనికి తోడు కాన్పు తర్వాత సీఎం కేసీఆర్ కిట్ ఇవ్వడంతో గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రికి బారులు తీరుతున్నారు. రాత్రి వేళలో కూడా వైద్యులు అందుబాటులో ఉండటంతో మరింత కాన్పుల సంఖ్య పెరిగింది. ఎక్కువగా సాధారణ కాన్పులు కావడంతో ప్రజలకు సర్కార్ దవాఖానకు వచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు.

సీహెచ్‌సీలో కాన్పుల వివరాలు

నెల	సాధారణ	సిజేరియన్	మొత్తం
ఏప్రిల్	95	69	164
మే	96	59	155
జూన్	72	68	140
జూలై	78	70	148
ఆగస్టు	64	77	141
సెప్టెంబర్	60	68	128

నమ్మకం పెరిగింది



ప్రభుత్వాసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగింది. గర్భిణులు ప్రతి నెల చెకప్‌కు వచ్చే సమయంలోనే వారి హెల్త్ ప్రొఫైల్‌ను తయారుచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. వారు డెలివరీ సమయానికి ఆస్పత్రి వచ్చే సరికి వారి ప్రొఫైల్ ఆధారంగా వారికి కాన్పు చేసేందుకు వీలవుతుంది. సీహెచ్‌సీలో సగటున 140 వరకు డెలివరీలు అవుతుండగా, రాష్ట్రస్థాయిలో సీహెచ్‌సీల జాబితాలో ముందు వరుసలో ఉన్నాం.
–శివరాం, కల్వకుర్తి సీహెచ్‌సీ సూపరింటెండెంట్

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి


కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆశా వర్కర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైస్ చైర్మన్ బాబురావుకు అందజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వర్దం పర్వతాలు మాట్లాడుతూ కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, కోశాదికారి అశోక్, నాయకురాల్లు వరలక్ష్మి, శశికళ, శివమ్మ, చెన్నమ్మ, గౌరమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆశావర్కర్లు ముట్టడించారు. గేటు ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత, సీఐటీయూ నాయకులు మల్లేష్, నిర్మల, సయ్యద్, పార్వతమ్మ, సైదులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆశావర్కర్లు ముట్టడించి ధర్నా నిర్వహించారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి చింతకుంట రాఘవేంద్ర, మాజీ మార్కెట్ చైర్మన్ నరేందర్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్, ఆశా వర్కర్లు కళావతి, శ్రీదేవి, శివలీల, చెన్నమ్మ, గౌరమ్మ, వకులాదేవి, గీత, దీప, అరుణ తదితరులున్నారు.

కల్వకుర్తిరూరల్: డివిజన్ పరిధిలోని వెల్దండ, చారకొండ, వంగూరు, ఊరుకొండ, కల్వకుర్తి మండలాల పరిధిలోని ఆశావర్కర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్‌లో మున్సిపల్ చైర్మన్ బాబురావుకు వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు


అచ్చంపేటలో..

సమస్యలు పరిష్కరిస్తాం



కొల్లాపూర్: మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని 4, 18 వార్డుల్లో ఆమె పర్యటించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యల గూర్చి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నారు. ఆమె వెంట కోఆప్షన్ సభ్యులు రుక్మొద్దీన్, నాయకులు చంద్రశేఖరాచారి, కర్నె వాసు, బిగులు రవి, ఎల్ఐసీ పాషా తదితరులున్నారు.

గణేశ్ లడ్డూ రూ.66వేలు

పెంట్లవెల్లి: మండలంలోని చిన్నపల్లె గ్రామంలో మంగళవారం వినాయక లడ్డూను వేలం పాట ద్వారా నిర్వహించారు. గ్రామానికి చెందిన కట్టోసి చిన్నబాలస్వామి రూ.66 వేలకు దక్కించుకున్నారు. ప్రబ్బతి సత్యనారాయణ రూ.16 వేలకు చిన్న లడ్డూను దక్కించుకొన్నారు. అనంతరం గ్రామ చెరువులో గణేశ్‌ను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బొగ్గు శ్రీనివాసులు, ఉపసర్పంచ్ రాము, పరుషరాముడు, గణేష్, రాములు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పోరాడినప్పుడు రైతులపై పెట్టిన కేసులను వెంటనే సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా కమిటీ రాష్ట్ర నాయకుడు ఎం శ్రీనివాసులు, వార్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు మంగళవారం అంబేద్కర్ కూడలిలో నిరసన తెలిపారు. విద్యుత్ సవరణ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంయుక్త మోర్చా కిసాన్ నాయకులు రవీందర్, సత్యనారాయణ, వెంకటేష్, బాలరాజు, కొత్త రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా కోడేరు మండల కమిటీ సభ్యుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. నర్సింహ, గణేష్, శివశంకర్‌ప్రసాద్, రామస్వామి, శివ, మాలిక్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



అమ్రాబాద్: పదర కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం కోనేరు స్వచ్ఛంద సంస్థ కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. చిన్న వయస్సులో పెళ్లిలు చేస్తే జరిగే అనర్థాలను వివరించారు. పాటలు పాడి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నవీన్, ఉమ, లక్ష్మి, జాహ్నవి, నూర్జహాన్, అలివేలు, చైతన్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల భిక్షాటన



తెలకపల్లి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం కొనసాగింది. మండల కేంద్రంలో కిరాణ దుకాణాలకు వెళ్లి భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా నాయకురాలు చంద్రకళ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జహీరబేగం, ప్రభావతమ్మ, సులోచన, రాధ తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ కమిటీని స్వాగతిస్తున్నాం

నాగర్‌కర్నూల్‌రూరల్: వేతన సవరణ కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నామని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం మధ్యాంతర బృతిని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు.

25 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలి

ఉప్పునుంతల: ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు పెన్షనర్లు ఎదురుచూస్తున్న నూతన పీఆర్సీ కోసం ప్రభుత్వం కమిటీని నియమించడం హర్షనీయమని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా కార్యదర్శి శేఖర్ ముదిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం 25 శాతం తగ్గకుండ భృతిని చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని ఆయన కోరారు.

ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



కందనూలు: ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ అండర్ 14, అండర్ 17 పోటీలకు కందనూలు విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానంలో నిర్వహించిన మండల స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో సీఎస్ఆర్ విద్యార్థులు యక్షిత్, జస్వంత్, చరణ్ తేజ్, శ్రేష్ఠ, నక్షత్ర (7వ తరగతి), హరిణి, తన్మై, ఇందు, అక్షిత(9వతరగతి), శ్రీనిధి(10వతరగతి), త్రిశలేశ్వర్, లాస్య (6వ తరగతి) ఎంపికయ్యారు. పాఠశాల ఫౌండర్ సి భాస్కరరావు ప్రిన్సిపాల్ రాజశేఖర్ శర్మ, యాజమాన్యం ఫసీయోద్దీన్, వెంకటేశ్వర్ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, నరేష్ ఆనంద్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా విద్యార్థులను అభినందించారు.

కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె



తెలకపల్లి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం మండల కేంద్రంలో కొనసాగింది. ఈ సందర్భంగా రైతు కమిటీ సభ్యుడు గోపస్ లక్ష్మణ్ వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికులకు వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వారికి బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ బుధవారం కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు సరస్వతి, పద్మ, గీత, రాణి, ప్రశాంతి, పార్వతమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికుల నిరసన

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజనం వంట కార్మికులు మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లయ్య, ఆంజనేయులు, అనురాధ, శాంతమ్మ, నిర్మల, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం


బాచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి: నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బాచారం గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసినందుకు మంగళవారం గ్రామస్తులు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి డప్పుచప్పుళ్లు, బొడ్డెమ్మలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఉపసర్పంచ్ మశన్న ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి బాచారం హైలెవల్ కెనాల్ నిర్మాణం చేపట్టి 30 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి పంచాయతీకి రూ.15 లక్షలు మంజూరు చేస్తామన్నారు. పాఠశాల భవన నిర్మాణానికి రూ.50 లక్షలు, బీటీ రోడ్డు నిర్మాణానికి, ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, రంగినేని అభిలాష్‌రావు, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్ రావు, ఈశ్వర్, రమేష్, మల్లయ్య, నాగరాజు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: అంకిరావుపల్లి సమీపంలోని కేఎల్ఐ కాలువలో సోమవారం తెల్లవారుజామున గల్లంతైన శివనాయుడు(శశి) మృతదేహం మంగళవారం లభ్యమైంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పట్టణంలోని 10వ వార్డులో అతని నివాసానికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు రంగినేని జగదీశ్వరుడు, కౌన్సిలర్ రహీంపాషా నివాళి అర్పించారు.

ప్రభుత్వ ఉద్యోగులపై చిన్నచూపు తగదు


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ

మన్ననూర్: ప్రభుత్వ ఉద్యోగులపై సీఎం కేసీఆర్‌కు చిన్నచూపు తగదని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మన్ననూర్‌లోని అంబేద్కర్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు 5 శాతం ఐఆర్ ప్రకటన చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. సమైక్య రాష్ట్రంలో 1997లో చంద్రబాబు ప్రభుత్వం 11 శాతం, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2004లో 8 శాతం, 2008లో మరోసారి 22 శాతం, తెలంగాణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి 27 శాతం ఐఆర్ ఇచ్చారని గుర్తు చేశారు. లివింగ్ కాస్టును దృష్టిలో ఉంచుకుని గతానికి రెండు రెట్లు ఎక్కువ ఇవ్వాల్సిందిపోయి 5శాతం ఐఆర్ ఏంటని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రాజేందర్, ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు హరినారాయణ, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, శివాజీ, రేణయ్య, మల్లికార్జున్, ఆనంద్, అంబనారాయణ, రమేష్, లోకనాథం, కర్ణయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు పాడి ఆవు మృతి

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో సోమవారం రాత్రి పిడుగు పాటుకు గురై పాడి ఆవు మృతి చెందినట్లు డాక్టర్ శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన బాలకృష్ణ రోజువారిగా పాడి ఆవును పశువుల షెడ్‌లో కట్టేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం పాలకోసం వెళ్లిన రైతుకు పాడిఆవు మృతి చెందినట్లు గుర్తించి పశువైద్యులకు సమాచారం అందించారు. పరీక్షించిన అధికారులు పంచనామా నిర్వహించారు. పాడి ఆవు విలువ దాదాపుగా రూ. 50 వేలు ఉంటుందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

తాడూరు: పదోన్నతులు కల్పించకుండా బదిలీలను చేపట్టొద్దని మండలంలోని ఆయా పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలు ధరించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ప్రమోషన్‌లు ఇచ్చిన తర్వాతనే బదిలీలు చేపట్టాలని పీఆర్‌సీడీఏ బకాయిలు చెల్లించి ఐఆర్ పెంచాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

వెల్దండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో మంగళవారం అఖిల్ నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 93 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. 29 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించారు. కంటి వైద్యులు శ్యామ్, సిబ్బంది ఉన్నారు.

ఆదివాసి విద్యార్థికి ఘన స్వాగతం



మన్ననూర్: అపోలో ఆసుపత్రి, డెటాల్ సంయుక్త సౌజన్యంతో నిర్వహించిన 'వ్యక్తిగత పరిశుభ్రత' అనే అంశంపై జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో నల్లమల ప్రాంతానికి చెందిన ఆదివాసి విద్యార్థి కాట్రాజు దినేష్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచాడు. గాంధీ జయంతిన ముంబాయిలో రూ.లక్ష నగదు బహుమానం అందుకున్నారు. మంగళవారం గ్రామానికి చేరుకున్న దినేష్‌ను పాఠశాల తరుపున శ్రీశైలం–హైదారాబాద్ ప్రధాన రహదారిలోని అంబేద్కర్ కూడలిలో ఘన స్వాగతం పలికి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. పాఠశాల వరకు బ్యాండు మేళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాం నాయక్, పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, రాధ, అపోలో ఫౌండేషన్ సభ్యుడు ఎంఏ జావిద్, విద్యార్థి తండ్రి కరంచంద్, గ్రామస్తులు సత్యనారాయణ, పెద్దయ్య, రాజేశ్వరి, రాఘవేందర్, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీలకు బతుకమ్మ చీరల సరఫరా


తాడూరులో గ్రామ పంచాయతీలకు పంపిణీ చేస్తున్న అధికారులు

ఉప్పునుంతల: మండలంలోని గ్రామ పంచాయతీల వారిగా బతుకమ్మ చీరలను మంగళవారం ఎంపీడీఓ లక్ష్మణ్‌రావుతోపాటు ఐకేపీ ఏపీఎం సైదులు, ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. గురువారం నుంచి రేషన్ షాపుల ద్వారా చీరల పంపిణీ చేస్తారని ఎంపీడీఓ తెలిపారు. మొత్తం మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో 10271 చీరలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం లబ్ధిదారులకు బతుకమ్మ చీరలు, బీసీ బంధు, క్రీడా కిట్స్‌లను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పంపిణీ చేస్తారని మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి మొత్తం 10,730మంది లబ్ధిదారులకు చీరలు మంజూరయ్యాయని తెలిపారు. అదేవిధంగా బీసీబంధు 30 మందికి, క్రీడాకిట్స్ 32, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తారని వివరించారు. మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకావాలని కోరారు.

తాడూరు: మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు 10471 చీరలు వచ్చాయని ఎంపీడీఓ గంగా మోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఐకేపీ ద్వారా ఆయా గ్రామ పంచాయతీలకు అందజేశామన్నారు.